# సాక్షి కామారెడ్డి

బుధవారం। 20। నవంబర్। 2024






## ప్రజలే పాలకులు

ప్రజా ప్రభుత్వంలో ప్రజలే పాలకులని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు.

- 8లో ▸



## త్వరగా పూర్తి చేయాలి

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.8 /12.0

## వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

## న్యూస్‌రీల్

### మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఆకుల శ్రీనివాస్



కామారెడ్డి టౌన్: జిల్లా మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షుడిగా ఆకుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పట్టణ మున్నూరు కాపు సంఘం భవనంలో జిల్లా అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా సంఘం ప్రతినిధి నీలం లింగం వ్యవహరించారు. జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. పోటీలో నిలిచిన ఆకుల శ్రీనివాస్‌కు 38 ఓట్లు రాగా.. నీలం నర్సింలుకు 5 ఓట్లు, అన్మాల గంగయ్యకు 3 ఓట్లు వచ్చాయి. అత్యధిక ఓట్లు సాధించిన ఆకుల శ్రీనివాస్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం నూతన అధ్యక్షుడితో ప్రమాణస్వీకారం చేయించారు.

**అన్ని రంగాల్లో రాణించాలి**

మున్నూరు కాపులు అన్ని రంగాల్లో రాణించాలని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ సూచించారు. ఈ ఎన్నిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో అత్యధికంగా ఉన్న మున్నూరుకాపుల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నూతన అధ్యక్షుడిని ఘనంగా సన్మానించారు. మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, సంఘం మాజీ అధ్యక్షుడు మామిండ్ల అంజయ్య, మహిళా అధ్యక్షురాలు లత, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

### 'మహిళలకు అవకాశమిస్తే అన్నిరంగాల్లో రాణిస్తారు'



కామారెడ్డి అర్బన్: మహిళలకు అవకాశమిస్తే అన్ని రంగాల్లో రాణించగలరని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ సంస్థ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులు, మహిళలకు రంగోళి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి మహిళల ప్రతిభను అభినందించారు. వేసిన ముగ్గులను ఎంపిక చేయడానికి న్యాయనిర్ణేతలుగా ఎస్సీ సంక్షేమశాఖ జిల్లా అధికారి రజిత, వైద్యులు రాజ్యలక్ష్మి, మాధవి, అనూష, రిహాన, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉరుదొండ వనిత, కౌన్సిలర్ మాడూరి అనూష తదితరులు పాల్గొన్నారు. మహిళలు స్వయంకృషితో ఎదగడంతో పాటు పోటీపరీక్షలు రాసి ఉద్యోగాలు సాధించాలని జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రజిత సూచించారు. అతిథులుగా పాల్గొన్న వారిని చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి సన్మానించారు.

### 'ఉత్తమ ఫలితాలు సాధించాలి'



సదాశివనగర్: ఇంటర్ వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడారు. కళాశాలకు రోజూ విద్యార్థి హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అజ్మల్‌ఖాన్, లెక్చరర్లు పాల్గొన్నారు.

### మేయర్ భర్తపై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

ఖలీల్‌వాడి (నిజామాబాద్ అర్బన్) : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాగారం 80 క్వార్టర్స్ వద్ద మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దండు నీతూ కిరణ్ భర్త దండు శేఖర్‌పై దాడి చేసిన షేక్ రసూల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం సాయంత్రం దండు శేఖర్‌పై దాడి జరిగిన విషయం తెలిసిందే. పోలీసులు నాలుగు బృందాలతో గాలించి నిందితుడిని సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అతడిని మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు.





నిజాంసాగర్ చౌరస్తా వద్ద యూటర్న్ తీసుకుంటున్న బస్సులు

## ప్రమాదకర యూటర్న్

- నిత్యం రద్దీగా ఉండే నిజాంసాగర్ చౌరస్తా
- ట్రాఫిక్‌లో బస్సులు మలపడం డ్రైవర్లకు సవాలే

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద యూటర్న్ తీసుకోవడానికి ఆర్టీసీ డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. అడ్డదిడ్డంగా దూసుకువచ్చే వాహనాలను తప్పించి యూటర్న్ తీసుకోవడం వారికి సవాల్‌గా మారింది. ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనన్న భయం రోజూ వెన్నాడుతోందని పలువురు డ్రైవర్లు పేర్కొంటున్నారు. కామారెడ్డి కొత్త బస్టాండ్ నుంచి ఎల్లారెడ్డి, పిట్లం, నిజాంసాగర్, లింగంపేట, గోపాల్‌పేట, మోతె, వండ్రికల్, కరడ్‌పల్లి, బాణాపూర్ తదితర రూట్లలో తిరిగే బస్సులు నిజాంసాగర్ చౌరస్తా వద్ద యూటర్న్ అవుతాయి. కాగా యూటర్న్ ప్రాంతం పొద్దస్తమానం రద్దీగా ఉంటుంది. దీంతో నిజాంసాగర్ చౌరస్తా వద్ద వాహనాలను తప్పించుకుని బస్సును దాటించడానికి డ్రైవర్లు నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. పొరపాటున బస్సు కాస్త వేగంగా ముందుకు వెళ్లినా.. బ్రేక్ ఫెయిల్ అయినా ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. నిజాంసాగర్ చౌరస్తాను జంక్షన్‌గా అభివృద్ధి చేయడానికి రూపొందించిన ప్రణాళికలన్నీ బుట్టదాఖలయ్యాయి. పట్టణంలో కీలకమైన జంక్షన్‌ను అభివృద్ధి చేస్తే తప్ప కష్టాలు తీరేలా లేవు. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



బస్సు యూటర్న్ తీసుకునే ప్రాంతంలో అడ్డదిడ్డంగా నిలిచిన వాహనాలు

# సర్వే @80 శాతం

- జిల్లాలో 3,03,327 కుటుంబాల గుర్తింపు
- ఇప్పటివరకు 2,43,499 కుటుంబాల సర్వే పూర్తి
- ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు
- ఆన్‌లైన్‌లో నమోదు చేయడంపై సిబ్బందికి శిక్షణ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిల్లాలో 80 శాతం పూర్తయ్యింది. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. వందశాతం సర్వేను పూర్తి చేసేందుకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు.



బిచ్కుందలో సర్వే తీరును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ కిరణ్మయి

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు హౌజ్ లిస్టింగ్ నిర్వహించారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి ఇంటి యజమాని పేరు, ఫోన్ నంబరు, ఇంటి నంబరు సేకరించారు. స్టిక్కర్ మీద సీరియల్ నంబరు వేసి ఇంటి గోడలకు అతికించారు. జిల్లాలో 3,03,327 ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. హౌజ్ లిస్టింగ్ అయిన మరుసటి రోజు నుంచి ఇంటింటి సర్వే మొదలయ్యింది. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. సోమవారం నాటికి 2,43,499 కుటుంబాల సర్వే పూర్తయ్యింది. మిగిలిన ఇళ్ల సర్వే కొనసాగుతోంది. ఇవే కాకుండా అక్కడక్కడా మిగిలిపోయిన హౌజ్ లిస్టింగ్ కూడా చేపడుతున్నారు. వందశాతం సర్వేను పూర్తి చేసేందుకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. రోజూ ఏదో ఒక మండలానికి వెళ్లి సర్వే తీరును పరిశీలిస్తున్నారు. అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్‌తోపాటు మండలాల ప్రత్యేకాధికారులు కూడా సర్వేను పర్యవేక్షిస్తూ, సిబ్బందికి అవసరమైన సూచనలు ఇస్తున్నారు.

**2,366 మంది ఎన్యుమరేటర్లు..**

సర్వేకోసం జిల్లాలో 2,366 మంది ఎన్యుమరేటర్లు, 237 మంది సూపర్‌వైజర్లను నియమించారు. సర్వేలో టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, ఐకేపీ, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొంటున్నారు. సూపర్‌వైజర్లుగా 223 మందిని నియమించి, మరో 14 మందిని రిజర్వ్‌లో ఉంచారు. గ్రామీణ ప్రాంతాల్లో 150 కుటుంబాలు, పట్టణ ప్రాంతాల్లో 125 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్‌ను కేటాయించారు. ఇప్పటి వరకు 80 శాతం సర్వే పూర్తయ్యింది. మిగిలిన ఇళ్ల సర్వే కొనసాగుతోంది. నాలుగైదు రోజుల్లో నూరు శాతం పూర్తవుతుందని భావిస్తున్నారు. అయితే సర్వేకు వెళ్లినప్పుడు చాలామంది ఆస్తులు, అప్పులు, వాహనాల వివరాలు చెప్పడం లేదని ఎన్యుమరేటర్లు చెబుతున్నారు. వ్యవసాయ భూములు, ఇతర వివరాలు మాత్రం ఇస్తున్నారని పేర్కొంటున్నారు.

### సర్వేను బహిష్కరించిన కాయితీలు

ఎస్టీ జాబితాలో చేర్చాలని ఏళ్ల తరబడిగా ఆందోళనలు చేస్తున్న కాయితీ లంబాడీలు (లబాన్) సర్వేను బహిష్కరించారు. రాష్ట్రంలో ప్రధానంగా జిల్లాలోని గాంధారి, లింగంపేట, పెద్దకొడప్‌గల్, పిట్లం తదితర మండలాల్లో వేల సంఖ్యలో కాయితీ లంబాడీలున్నారు. వీరు బీసీలలో ఉండడంతో విద్య, రాజకీయ పరంగా నష్టపోతున్నారు. ఎస్టీలలో చేర్చాలని దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నారు. ఏళ్లుగా తమ సమస్య పరిష్కారం కావడం లేదనే ఆవేదనతో వారు సర్వేను బహిష్కరించారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం కాయితీ లంబాడీలు ఎదురు చూస్తున్నారు.

### త్వరలో డాటా ఎంట్రీ..

కుటుంబ వివరాలను సేకరిస్తున్న ప్రభుత్వం వాటిని పొందుపరిచేందుకు ప్రత్యేక యాప్ రూపొందిస్తోంది. రెండు మూడు రోజుల్లో యాప్ అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు. ఆన్‌లైన్ నమోదు కోసం ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. యాప్ వచ్చిన తర్వాత సర్వేలో సేకరించిన కుటుంబాల వివరాలన్నింటినీ అందులో నమోదు చేయనున్నారు. 56 కాలమ్స్‌లో ఉన్న 76 ప్రశ్నలకు సంబంధించిన పూర్తి సమాచారం అందులో నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే సర్వే వివరాలు యాప్‌లో నమోదు చేయడానికి ఎక్కువ సమయం పట్టవచ్చని భావిస్తున్నారు.

## నేటి నుంచి కాలభైరవుడి ఉత్సవాలు

- ఇసన్నపల్లి(రామారెడ్డి) ఆలయంలో ఏర్పాట్లు
- భారీగా తరలిరానున్న భక్తులు



కాలభైరవ స్వామి మూలవిరాట్

రామారెడ్డి : కోరిన కోరికలు తీరుస్తూ భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఇసన్నపల్లి(రామారెడ్డి) కాలభైరవ స్వామి ఆలయం కార్తీక బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యింది. ఐదు రోజులపాటు వైభవంగా స్వామివారి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నారు. ఉత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. బుధవారం ఉదయం 6 గంటలకు గణపతి పూజతో వేడుకలు మొదలవుతాయి. 72 గంటలపాటు స్వామివారికి సంతత ధారాభిషేకం నిర్వహిస్తారు. గురువారం మధ్యాహ్నం బద్దిపోచమ్మ బోనాలు, శుక్రవారం సాయంత్రం 6 గంటలకు లక్ష దీపార్చన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన డోలారోహణం కార్యక్రమం శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ ఘట్టాన్ని తిలకించడానికి భక్తులు భారీగా తరలివస్తారు. అదేరోజు సాయంత్రం ఎడ్లబండ్ల ఊరేగింపు ఉంటుంది. ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఐదు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచీ భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో ప్రభు గుప్తా తెలిపారు.



విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆలయం

## నేడు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు

కామారెడ్డి అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. కామారెడ్డిలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో నిర్వహించే కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొంటారని సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి తెలిపారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందినవారికి బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

## సమాచార లోపంతో ఇబ్బంది

- 21వ తేదీన డీఎస్సీ స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- మంగళవారమే హాజరు కావాలంటూ జిల్లా విద్యాశాఖ నుంచి మెసేజ్
- ఇబ్బందిపడ్డ అభ్యర్థులు

కామారెడ్డి టౌన్ : విద్యాశాఖ ఇచ్చిన తప్పుడు సమాచారంతో డీఎస్సీ -2024 లో స్పోర్ట్ కోటాలో ఎంపికైన అభ్యర్థులు ఇబ్బందిపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లాకు చెందిన 19 మంది స్పోర్ట్స్ కోటాలో డీఎస్సీ–2024కు ఎంపికయ్యారు. వారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ గురువారం ఉంది. అయితే జిల్లా విద్యాశాఖ అధికారులు మంగళవారమే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉందంటూ అభ్యర్థులకు సమాచారం ఇచ్చారు. ఒర్జినల్ సర్టిఫికెట్లతో హైదరాబాద్‌లోని దోమలగూడ ప్రభుత్వ కళాశాలలో హాజరు కావాలని సూచించారు. దీంతో అభ్యర్థులు అక్కడికి వెళ్లి ఇబ్బందులు పడ్డారు. 21వ తేదీన పరిశీలన ఉండగా ఈరోజు ఎందుకు వచ్చారని అక్కడి అధికారులు పేర్కొనడంతో వెనుదిరిగారు. ఈ విషయమై డీఈవో రాజును 'సాక్షి' వివరణ కోరగా తమకు రాష్ట్ర అధికారుల నుంచి సరైనా సమాచారం లేకపోవడం వల్ల ఇలా జరిగిందని పేర్కొన్నారు.



ATTENTION DSC-2024

As Per the orders of Director of School Education, Hyd Proc RC No:20/RC-1/TRT/DSC/2023. Dated:13-11-2024.

You are hereby directed to attend certificate verification with all Original Qualification Certificates, Sports Certificates, Annexure -III and one set of Xerox Certificates on 19.10.2024 from 10.00 AM to 5.00 PM at Govt College of Physical Education, Domalguda, Hyd without Fail.

Regards
DEO KAMAREDDY

19న వెరిఫికేషన్‌కు వెళ్లాలని అభ్యర్థుల ఫోన్లకు వచ్చిన సమాచారం

## బోనస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కామారెడ్డి క్రైం: సన్న వడ్లకు ప్రభుత్వం అందిస్తున్న బోనస్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా బీర్కూర్ రైతులతో మాట్లాడారు. బీర్కూర్ కొనుగోలు కేంద్రంలో ఉన్న పోశెట్టి, కిషోర్ అనే రైతులతో మాట్లాడి వారి వివరాలు తెలుసుకున్నారు. కామారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 2.34 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని అధికారులు మంత్రితో పేర్కొన్నారు. సన్న వడ్లు విక్రయించిన 1,152 మంది రైతులకు రూ. 4.3 కోట్ల బోనస్ జమ చేశామన్నారు. కార్యక్రమంలో డీఏవో తిరుమల ప్రసాద్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, ఇన్‌చార్జి డీఎస్‌వో నరసింహారావు, సహకార అధికారి రామ్మోహన్, రైతులు, సహకార సంఘాల చైర్మన్‌లు పాల్గొన్నారు.



మంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న బీర్కూర్ రైతులు, అధికారులు

## అభివృద్ధితోపాటు సంక్షేమానికి ప్రాధాన్యత

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితోపాటు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో మంగళవారం ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళాశక్తి కార్యక్రమం కింద మైక్రో ఎంటర్‌ప్రైజెస్, పాడి పరిశ్రమ, క్యాంటీన్‌ల నిర్వహణ లాంటి కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. జిల్లాలో 423 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. ప్రభుత్వం సన్నరకం వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తోందన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం అంతడుపుల నాగరాజు కళా బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 75 మంది కళాకారులు కలిసి ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, వి.విక్టర్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవో రంగనాథ్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రచార వాహనాల ప్రారంభం**

ప్రజాపాలన కళాయాత్ర ప్రచార వాహనాలను మంగళవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆడిటోరియం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రచార రథాలు గ్రామాలకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తాయన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, అధికారులు పాల్గొన్నారు.

### ప్రొటోకాల్ రగడ

విజయోత్సవాలు ప్రారంభం కాకముందే ప్రొటోకాల్ వివాదం రాజుకుంది. కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించిన జిల్లా యంత్రాంగం ముందుగా ఓ ఫ్లెక్సీని ఆర్డర్ చేసింది. దాంట్లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఫొటో లేకపోవడంతో కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అదనపు కలెక్టర్ విక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన స్పందించి వెంటనే ఫ్లెక్సీలో షబ్బీర్ అలీ ఫొటో పెట్టించారు. దీంతో కాంగ్రెస్ నాయకులు శాంతించారు.





ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

## ఇబ్బందులు లేకుండా చూడాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

దోమకొండ: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల వద్ద చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం అంచనూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సొసైటీ సీఈవో బాల్‌రెడ్డికి సూచించారు. అనంతరం గ్రామంలోని హెల్త్ సబ్‌సెంటర్‌ను సందర్శించారు. మెరుగైన సేవలు అందించాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో జరుగుతున్న సమగ్ర సర్వేను పరిశీలించారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా సర్వే పూర్తి చేయాలని, కోడ్‌ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డాటా ఎంట్రీ సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సంజయ్‌రావ్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి జ్యోతి, వివిధ శాఖల అధికారులున్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

## క్లుప్తంగా

### బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ సమస్యలు పరిష్కరించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తెలంగాణలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ధర్మసమాజ పార్టీ గౌరవ అధ్యక్షుడు బాబు సాయికుమార్, మండల అధ్యక్షుడు రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తాడ్వాయి తహసీల్దార్ రహిమొద్దీన్, ఎంపీడీవో సయ్యద్ సాజీద్అలీలకు వినతిపత్రాలను అందజేశారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా విద్యను అందించాలని, ప్రతి గ్రామంలో ఆస్పత్రిని నిర్మించాలని కోరారు. నేతలు నితిన్, ప్రవీణ్ తదితరులున్నారు.

### క్రీడాకారులను అభినందించిన జడ్జి



నిజామాబాద్నాగారం: తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16, 17 తేదీల్లో గచ్చిబౌలిలో నిర్వహించిన 38వ సబ్ జూనియర్ తైక్వాండో స్టేట్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల మంగళవారం అభినందించారు. అమెచ్యూర్ తైక్వాండో క్రీడాకారులు సహస్ర రాథోడ్ గోల్డ్ మెడల్, అవిరాజ్, ఆదితి, శుక్లా సిల్వర్ మెడల్ సాధించగా, సాయిప్రసన్న బ్రాంజ్ మెడల్, ఘన బ్రౌన్ మెడల్ సాధించారు. కోచ్ మనోజ్ పాల్గొన్నారు.

### డిప్యూటీ సీఎంను కలిసిన గడుగు



నిజామాబాద్ సిటీ: రాష్ట్ర వ్యవసాయ కమి షన్ సభ్యుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఇందిరా గాంధీ జయంతి నిర్వహించారు.మల్లు భట్టి ముఖ్య అతిథిగా హాజరు కాగా.. గడుగు గంగాధర్ ఆయను సన్మానించారు.

### ప్రజలకు మెరుగైన సేవలందించాలి

రుద్రూర్: పొతంగల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో మంగళవారం సందర్శించారు. కార్యాలయాల పనితీరును పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల ప్రగతి, హాజరు, విద్యా బోధన, పరీక్షల నిర్వహణ తదితర వివరాలపై ఆరా తీశారు. జీపీ కార్యాలయంలో విద్య, పంచాయతీ రాజ్ పనితీరుపై సమీక్షించారు. బాధ్యతాయుతంగా ఉండాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సర్వే వివరాలను సబ్ కలెక్టర్‌కు అధికారులు వివరించారు. ఎంఈవో లోల శంకర్, పంచాయతీ అధికారి చందర్, హెచ్ఎం సాయిలు తదితరులు ఉన్నారు.





మల్కాపూర్(ఏ) గ్రామ శివారులోని బండ రాళ్లపై ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

# బండరాళ్లే ధాన్యం కల్లాలు

- ధాన్యం ఆరబోసేందుకు రైతుల తిప్పలు



నిజామాబాద్ రూరల్: ధాన్యం ఆరబోసేందుకు స్థలం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దని అధికారులు స్పష్టం చేస్తుండడంతో స్థలం లేక అవస్థలపడుతున్నారు. మండలంలోని మల్కాపూర్(ఏ) గ్రామానికి చెందిన రైతులు పక్కనే ఉన్న గుట్ట ప్రాంతంలో పెద్దపెద్ద బండరాళ్ల(పరుపు బండ)పై ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. గుట్ట ప్రాంతంలో రాత్రి వేళ ధాన్యాన్ని కాపాల ఉండే రైతులు వన్యప్రాణాలు సంచరిస్తున్నాయని భయపడుతున్నారు. కల్లాలకు సరైన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## ప్రజా ప్రభుత్వంలో ప్రజలే పాలకులు



మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

- రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్/పిట్లం(జుక్కల్): ప్రజా ప్రభుత్వంలో ప్రజలే పాలకులుగా.. రైతులే రాజులుగా..రైతుల శ్రేయస్సే పరమావధిగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మంగళవారం పిట్లం మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు హాజరై మాట్లాడారు. ధనిక రాష్ట్రాన్ని గత పాలకులు అప్పుల కుప్ప చేయడం వల్ల అభివృద్ధికి ఆటంకం కల్గుతోందన్నారు. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులు, ప్రజలు, మహిళలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారన్నారు. డిసెంబర్ నెలాఖరు నాటికి రూ. 2 లక్షల వరకు పంట రుణాలు ప్రభుత్వం వంద శాతం మాఫీ చేస్తుందన్నారు. మార్కెట్ కమిటీలు, సహకార సంఘాలు రైతుల సంక్షేమం కోసమే ఉన్నాయన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, నాయకులు విఠల్‌రెడ్డి, రాంరెడ్డి, ఏలే మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

**సహకార సంఘం నూతన భవనం ప్రారంభం**

పిట్లం/నిజాంసాగర్(జుక్కల్): పిట్లం మండలంలోని చిన్నకొడప్‌గల్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనం, నిజాంసాగర్ మండలం గోర్గల్ గ్రామ గేటు వద్ద అచ్చంపేట సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ప్రారంభించారు. సహకార సంఘాల బలోపేతమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి



నిజామాబాద్ సిటీ: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని, ఆమె సేవలను జాతి మరువదని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీభవన్‌లో మంగళవారం ఇందిరాగాంధీ 107వ జయంతిని నిర్వహించారు. ఇందిరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ భవన్‌లో తాహెర్‌బిన్ మాట్లాడుతూ.. భారత దేశాన్ని ప్రపంచ దేశాల సరసన నిలిపేందుకు ఎన్నో సాహసోపేత నిర్ణయాలను ఇందిర తీసుకున్నారన్నారు. బ్యాంకుల జాతీయకరణం, గరీబీ హటావో, హరిత విప్లవం, 20 సూత్రాల అమలు వంటి ఆమె తీసుకున్న సంచలన నిర్ణయాలని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, సేవాదళ్ సంతోష్, నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రీతం, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, మహిళా కాంగ్రెస్ నగర అధ్యక్షురాలు రేవతి, నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు వినయ్, డీసీసీ డెలిగేట్ ప్రమోద్, మహిళా కాంగ్రెస్ నాయకులు చంద్రకళ, ఉష, మల్లికా బేగం, విజయలక్ష్మి, ధర్మాగౌడ్, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ సాయిలు సంగెం, మాజీ మేయర్ సుజాత, అపర్ణ, సాయికుమార్ కుమార్, ముషపటేల్, స్వప్న, ఆకుల మహేందర్ పాల్గొన్నారు.

## స్వయంపాలన దినోత్సవం



దోమకొండలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో..

దోమకొండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పాలనా దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థినులే ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు బోధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాచారెడ్డి : మొట్ట మొదటి భారత మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మండలంలోని లచ్చాపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం స్వయం పాలనా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు చక్కగా బోధించారు. హెచ్ఎం రాజేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, పారినాయుడు, రాజేశ్వరి, రమేష్, నర్సింలు ఉన్నారు.



లచ్చాపేట ఉన్నత పాఠశాలలో..

## సెల్‌ఫోన్‌ల అప్పగింత



నవీపేట: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు మంగళవారం అప్పగించామని ఎస్సై వినయ్ తెలిపారు. తమ మొబైల్ ఫోన్‌లు పోయినట్లు కొద్ది నెలల క్రితం 10 మంది బాధితులు ఫిర్యాదు చేశారని, ఆధునిక పరిజ్ఞానంతో సీఈఐఆర్ ద్వారా ఫోన్‌లను రికవరీ చేశామన్నారు.

# నిష్పక్షపాతంగా సర్వే చేపట్టాలి

**బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి**

బిచ్కుంద(జుక్కల్): సమగ్ర కుటుంబ సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్స్ నిష్పక్షపాతంగా, గడువులోగా సర్వే పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. మంగళవారం బిచ్కుంద తహసీల్ కార్యాలయం సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం సర్వే సరళిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు సమగ్ర సర్వేపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో గోపాల్ ఉన్నారు.

**ఇసుక అక్రమ రవాణాపై విచారణ**

మండంలోని పుల్కల్, ఖద్గాం, హజ్గుల్, శెట్లూర్ మంజీరా నుంచి అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుక రవాణా కొనసాగుతుంది. దీనిపై సబ్ కలెక్టర్ కిరణ్మయి విచారణ చేసి స్థానిక తహసీల్ కార్యాలయంలో ఆర్ఐ రవీందర్‌కు మెమో జారీ చేశారు. రెండు రోజుల క్రితం మంజీరా వద్ద కాపలాకాస్తున్న వీఆర్ఏలు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఆర్ఐ, వీఆర్ఏలతో ఫోన్‌లో మాట్లాడి పట్టుకున్న ట్రాక్టర్లు వదిపెట్టాలని ఆదేశించడంతో ట్రాక్టర్లను వదిలేశారు. ఆ అధికారి ముడుపులు తీసుకొని వదిలేశారని ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో సబ్ కలెక్టర్ విచారణ చేపట్టారు. అలాగే అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పట్టుకుని రూ. 5 వేలు జరిమానా విధించారు.

## జూనియర్ కళాశాల తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..



విద్యార్థులతో మాట్లాడుతున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. 'విద్యార్థులున్నా...హాజరు శాతం సున్నా' అంటూ సోమవారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి ఆమె స్పందించారు. విద్యార్థులు గైర్హాజరు కావడానికి గల కారణాలను అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు రోజూ తరగతులకు వచ్చేలా అధ్యాపకులు బాధత్య తీసుకోవాలని ఆమె సూచించారు. తహసీల్దార్ భిక్షపతి, ఎంఈవో తిరుపతి రెడ్డి తదితరులున్నారు.

## కుటుంబ సర్వేను త్వరగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



మద్నూర్‌లో సర్వే వివరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

పెద్దకొడప్‌గల్/పిట్లం/మద్నూర్(జుక్కల్): ప్రభుత్వం తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. పిట్లం, మద్నూర్, పెద్ద కొడప్‌గల్ తహసీల్ కార్యాలయాల్లో మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో జరుగుతున్న ఇంటింటి సర్వే వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. సర్వే ద్వారా వచ్చిన సమాచారాన్ని వెంటనే కంప్యూటర్‌లో నమోదు చేయాలన్నారు. సర్వే వివరాలను ఆన్‌లైన్ చేసే ఆపరేటర్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు. కంప్యూటర్‌లో నమోదు ప్రక్రియ ప్రారంభించాలన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మాధవ రావు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థి డి.రాహుల్ జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ మాధవ రావు తెలిపారు. మంగళవారం అభినందన సభలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16 నుంచి 18 వరకు నిర్మల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడన్నారు. డిసెంబర్ 2 నుంచి 6 వరకు న్యూఢిల్లీలో జరిగే పోటీలకు తెలంగాణ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రాహుల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు..**



అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలోని ఆర్ఆర్ టాలెంట్ పాఠశాలకు చెందిన పృధ్వీజ అండర్–14 విభాగం బాలికల వాలీబాల్ పోటీలలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి విజేతగా నిలిచి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి తెలిపారు. మంగళ వారం పృధ్వీజను అభినందించి గోల్డ్ మెడల్ అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. పీఈటీలు రామ్ రెడ్డి, సునీల్ రెడ్డి, సంతోష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

**విద్యార్థులకు క్రీడా దుస్తులు, బూట్ల పంపిణీ**



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రాష్ట్రస్థాయిలో వివిధ క్రీడా పోటీలకు ఎంపికైన గోపాల్‌పేట హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం గ్రామంలోని జేఎస్ఎం ఆస్పత్రి డాక్టర్ సంతోష్‌కుమార్ క్రీడా దుస్తులతోపాటు, బూట్లను పంపిణీ చేశారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత ప్రతిభ కనబర్చి ఉన్నతస్థాయికి చేరాలని ఆయన ఆకాంక్షించారు. హెచ్ఎం వెంకట్రాంరెడ్డి, పీడీ సభాత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



క్రీడా సామగ్రిని అందిస్తున్న ఆజాద్ హింద్ యువజన సంఘం సభ్యులు

రామారెడ్డి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆజాద్ హింద్ యువజన సంఘం అధ్యక్షుడు గురిజకుంట స్వామి పిలుపునిచ్చారు. రామారెడ్డి గ్రామంలోని బాలుర పాఠశాలకు రెండు ఫుట్‌బాల్లు, బాలికల పాఠశాలకు వాలీబాల్, వాలీబాల్‌నెట్, జూనియర్ కళాశాలకు ఒక వాలీబాల్‌ను అందజేశారు. రామారెడ్డి గ్రామానికి క్రీడా గ్రామంగా పేరు ఉందని, ఆ పేరును విద్యార్థులు నిలబెట్టాలని సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. సంఘం సభ్యులు ప్రవీణ్, గంగాధర్, రంగురాజాగౌడ్, శ్రీనివాస్, సదీప్, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.



## క్రైం కార్నర్

### దుబాయ్‌లో మాదాపూర్ వాసి మృతి



ఖాజామియా (ఫైల్)

మాక్లూర్: బతుకుదెరువు కోసం దుబాయికి వెళ్లిన మండలంలోని మాదాపూర్‌కు చెందిన ఖాజామియా (55) అక్కడే గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు మంగళవారం తెలిపారు. దుబాయిలో పనిచేస్తుండగా ఈనెల 17న ఖాజామియాకు గుండెపోటు వచ్చినట్లు తమకు ఫోన్ ద్వారా సమాచారం అందిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవతీసుకుని ఖాజామియా మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించాలని కోరారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

**చేపలవేటకు వెళ్లి ..**

మోర్తాడ్(బాల్కొండ): భీమ్‌గల్ మండలం బాబాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్(33) అనే వ్యక్తి మంగళవారం గ్రామ సమీపంలోని కుంటలో చేపలు పట్టేందుకు వెళ్లి అందులో పడి మృతి చెందాడు. మృతుడి భార్య రుక్సానా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, మూడేళ్ల కొడుకు ఉన్నారు.

### పాత కక్షలతో కత్తితో దాడి



ఆస్పత్రిలో షేక్ సోహెల్

నవీపేట: పాతకక్షలతో ఓ యువకుడిపై మరో యువకుడు కత్తితోదాడి చేశాడు. ఈ ఘటన మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకున్నట్లు ఎస్సై వినయ్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలోని దర్యాపూర్ కాలనీకి చెందిన షేక్ అమన్ ఆరు నెలల క్రితం డీజే సౌండ్ పెట్టి శుభకార్యాన్ని జరుపుకోగా శబ్ద కాలుష్యమవుతోందని అదే కాలనీకి చెందిన షేక్ సోహెల్ వాగ్వాదానికి దిగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు డీజేను నిలిపివేయించారు. దీంతో కక్షపెంచుకున్న షేక్ అమన్ సోదరుడు షేక్ గౌస్ సోమవారం రాత్రి స్నేహితులతో సోహెల్‌పై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. గాయపడిన సోహెల్‌ను జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుని మామ షేక్ రజియొద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### చిన్నారిపై వీధికుక్క దాడి



గాయపడిన చిన్నారి ఫైజా

బాన్సువాడ రూరల్: పట్టణంలోని మదీనా కాలనీలో మంగళవారం వీధి కుక్క స్వైరవిహారం చేసింది. కాలనీకి చెందిన ఐదేళ్ల చిన్నారి ఫైజాపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. దీంతో మాజీ వార్డు సభ్యుడు షేఖ్ అక్బర్ ఆధ్వర్యంలో స్థానికులు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేశారు. మున్సిపాలిటి పరిధిలో కుక్కల బెడదతీవ్రమైందని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

### డయల్ 100ను దుర్వినియోగం చేసినఒకరికి జైలు శిక్ష

బోధన్‌టౌన్(బోధన్): డయల్ 100ను దుర్వినియోగం చేసిన వ్యక్తికి ఒక రోజు జైలు శిక్షను విధిస్తూ న్యాయమూర్తి మంగళవారం తీర్పు వెలువరించినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి 100 డయల్‌కు ఫోన్ చేసి పోలీసుల సమయాన్ని వృథా చేశాడని, సదరు వ్యక్తిని కోర్టులోని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేష తల్పసాయి ఎదుట హాజరుపర్చగా ఒక రోజు జైలు శిక్ష విధించారన్నారు.

### గోవులను తరలిస్తున్న ట్రక్కు పట్టివేత

నిజాంసాగర్(జుక్కల్): గోవులను తరలిస్తున్న ట్రక్కును మండలంలోని సుల్తాన్‌నగర్ గ్రామం వద్ద సోమవారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. ట్రక్కులో పరిమితికి మించి 27 ఆవులను తరలిస్తుండగా పట్టుకుని గోశాలకు తరలించామని ఎస్సై సుధాకర్ తెలిపారు. బాధ్యులపై కేసు నమోదు చేశామన్నారు.

### 12 ట్రాక్టర్లు.. టిప్పర్..

బోధన్ రూరల్: పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు సోమవారం అర్ధరాత్రి తరువాత ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 12 ట్రాక్టర్లతోపాటు ఒక టిప్పర్‌ను పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మంజీర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 12 ట్రాక్టర్లను సిద్దాపూర్ శివారులో, టిప్పర్‌ను మందర్న శివారులో పట్టుకుని కేసు స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశామన్నారు.

### కాన్పుకోసం వస్తే ఆభరణాలు కాజేశారు

ఖలీల్‌వాడి: కాన్పుకోసం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన మహిళ ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం చోరీ చేశారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం జక్కాపూర్ గ్రామానికి చెందిన ఓ గర్భిణీ కాన్పు కోసం కాన్పు చేయించుకునేందుకు జీజీహెచ్‌కు వచ్చింది. సదరు మహిళను ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకువెళ్లే ముందు ఆమె మూడు గ్రాముల బంగారం, 10తులాల వెండిని పక్కన పెట్టి వెళ్లింది. ఆపరేషన్ తరువాత వచ్చి చూసేసరికి ఆభరణాలు కనిపించకపోవడంతో ఆమె భర్త విఠల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

### వృద్ధుడు అదృశ్యం

భిక్కనూరు: జంగంపల్లి గ్రామానికి చెందిన కొలిమి పోచయ్య (51) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 15న పోచయ్య చాయ్ తాగి వస్తానని వెళ్లి తిరిగి తిరిగిరాలేదని అతడి భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పుల బాధలో ఉన్న తన భర్త ఆచూకీ లభించడం లేదని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**తిమ్మక్‌పల్లికి చెందిన మహిళ..**



దాకవ్వ

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లి గ్రామానికి చెందిన రాజబోయిన దాకవ్వ అనే మహిళ అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు మంగళవారం తెలిపారు. ఈ నెల 16న ఇంటి నుంచి బయటికి వెళ్లిన దాకవ్వ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్లు వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో దాకవ్వ బంధువులు లక్ష్మీపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఒకరిపై కేసు నమోదు

ఎల్లారెడ్డి: మండలంలోని హాజీపూర్ శివారులో రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. మహ్మద్‌నగర్ మండల కేంద్రానికి చెందిన వెంకట్‌రెడ్డి ఈనెల 16న బైకుపై కామారెడ్డి నుంచి మహ్మద్‌నగర్‌కు వెళ్తుండగా హాజీపూర్ శివారులో ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకట్‌రెడ్డికి తీవ్రగాయాలుకాగా ఆస్పత్రిలో చికిత్స పొందా డు. బాధితుడు మంగళవారం ఫిర్యాదు చేసయగా కే సు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**యువకుడిపై పోక్సో ..**

జుక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ఈ నెల 14న బలవంతంగా పెళ్లి చేసుకున్న పడకల్‌కు చెందిన యువకుడితోపాటు మరి కొంత మందిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామన్నారు.

### కుటుంబ కలహాలతో ఆత్మహత్య

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిర్మన్‌పల్లికి చెందిన సాయిలు (24) కుటుంబ కలహాల కారణంగా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరిఫ్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గత కొన్ని రోజుల క్రితం సాయిలును ఆయన భార్య వదిలివెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన సాయిలు ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

**అనారోగ్యంతో వృద్ధుడు..**

భిక్కనూరు: కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కాచాపూర్ గ్రామానికి చెందిన సిద్దిపేట రాజిరెడ్డి (75) అనే వృద్ధుడు మంగళవారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్ద ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించామన్నారు.